క్లుప్తంగా

నేడు భూభారతి పోర్టల్ ఆవిష్కరణ

ఆత్మకూరు : మండలకేంద్రంలో నేడు (శనివారం) భూభారతి పోర్టల్ ఆవిష్కరించనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాపురం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

భూ భారతిపై నేడు అవగాహన సదస్సు

దామెర : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న భూ భారతి చట్టంపై నేడు (శనివారం) అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రం సమీంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఉదయం 9 గంటలకు అవగాహన సదస్సు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య హాజరుకానున్నట్లు ఆమె వెల్లడించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సన్మాన సభను విజయవంతం చేయాలి




వేలేరు: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో త్వరలో నిర్వహించబోయే పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సన్మాన సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసి ఏబీసీడీ వర్గీకరణ సాధించిన వ్యక్తి మంద కృష్ణ మాదిగ అని అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్ కుమార్, నాయకులు యేసు, మల్లయ్య, సారయ్య, రాజు, సాంబరాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి



దామెర : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌లో ఉపాధి పనులను ఆమె శుక్రవారం పరిశీలించి కూలీ రేట్లపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన కొలత ప్రకారం పనిచేసి కనీసం రోజులు రూ.307 కూలి వర్తించేలా పనులు చేయాలని అన్నారు. ఎండ తీవ్రత, వడగాల్పులను దృష్టిలో ఉంచుకొని మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి కూలీ కనీసం వంద రోజులు పనిచేయాలని సూచించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి సిరివెన్నెల, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మే 5న సీపీఐ మండల సభ



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో మే 5న నిర్వహించే సీపీఐ 8వ మండల మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ముల్కనూర్‌లో పార్టీ మహాభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయనా మాట్లాడుతూ మండలంలో జరిగే భూ పోరాటంలో పాల్గొన్న నిరుపేదలకు భూమి పట్టాలు అందజేయాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లను సైతం మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ అమలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యురాలు రమాదేవి, కొంగల రామచంద్రారెడ్డి, ఆదరి రమేష్, సన్నీల రవి, కృష్ణారెడ్డి, సుంచు కుమారస్వామి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వడ్డేపల్లి చర్చి కూడలి, ఎన్జీఓస్ కాలనీ కూడలి, రాఘవేంద్రనగర్, స్నేహనగర్, భవానినగర్, సూర్య ఆస్పత్రి, వడ్డేపల్లి, టీచర్స్ కాలనీ -2, విజయ్‌పాల్ కాలనీ, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సొంతింటి కల నెరవేరేనా ?

- అప్పులు చేసి నిర్మించుకున్న 'గృహలక్ష్మి' లబ్ధిదారులు
- ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆదుకోవాలి



నడికూడలో మధ్యలోనే ఆగిన ఇంటి నిర్మాణం

నడికూడ : ఇంటి నిర్మాణం పేదలకు కలగానే మిగిలిపోయింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద పేదలకు, ఇల్లు లేని వారికి, సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి అవకాశం కల్పించింది. అప్పుడే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఈ పథకం కొనసాగడంపై అనుమానం ఉండడంతో ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు వెనుకడుగు వేశారు. కొత్త ప్రభుత్వ వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇల్లు కూడా ఉండడంతో గృహలక్ష్మి లబ్ధిదారులకు ఆశలు చిగురించాయి. ఉన్న పాత ఇంటిని కూ లగొట్టి చాలా వరకు అద్దె ఇంట్లో ఉంటూ నూతన గృహనిర్మాణానికి పనులు చేపట్టారు. కొండ నా లుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లు తమ పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి చాలా వరకు ఇళ్లు బేస్‌మెంట్, పిల్లర్స్ వరకు నిర్మాణం చేపట్టి మధ్యలో వదిలివేశామని లబ్ధిదారులు వాపోయారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు 320 వరకు లబ్ధిదారులు తమ సొంత ఇంటి కోసం గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రభుత్వం సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి తమను ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అప్పు చేసి స్థలం కొన్నాం



సొంత ఇంటి కోసం అప్పు చేసి స్థలం కొనుక్కొని గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణం పనులు చేపట్టాం. ఫిల్లర్స్ వరకు ఇంటి నిర్మాణం చేశాం.

– మేకల రాధ, నడికూడ

నిర్మాణం మధ్యలోనే ఆపేశాం



ఇంటి నిర్మాణం కోసం అప్పు చేసి పనులు ప్రారంభించాం, గృహలక్ష్మి పథకం ద్వారా ఎలాంటి ఆర్థిక సాయం రాకపోవడంతో ఇంటి నిర్మాణం మధ్యలోనే నిలిపివేశారు.

– తాళ్ల లావణ్య, నడికూడ

ఆర్థికసాయం అందుతుంది

ఇందిరమ్మ ఇళ్లతో సంబంధం లేకుండానే గృహలక్ష్మి లబ్ధిదారులకు రూ.మూడు లక్షల వరకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుంది. ఇటీవల లబ్ధిదారుల నుంచి బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకోవడం జరిగింది.

– పీడీ హౌసింగ్ రవీందర్

ఉద్యమకారులను విస్మరిస్తున్న మాజీ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

శాయంపేట : బీఆర్ఎస్ పార్టీ స్థాపించిన 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో ఎన్నో ఇబ్బందులు పడ్డ ఉద్యమకారులను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విస్మరిస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు పోడిశెట్టి గణేష్, ఇమ్మిడిశెట్టి రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వెంకటరమణారెడ్డి ఆరేళ్ల క్రితం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు వలస వచ్చారని, అప్పటి నుంచి ఉద్యమకారులను, సీనియర్ నాయకులను పక్కనపెట్టి తన వెంబడి వచ్చిన నాయకులకే పదవులు కట్టబెట్టారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కేసులపాలైన సీనియర్ నాయకులను పక్కకు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇక నుంచి రమణారెడ్డి ఆటలు సాగవని ఎక్కడ వేయని కమిటీలను భూపాలపల్లి నియోజకవర్గంలో ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో వందలాది మంది సమక్షంలో గ్రామ కమిటీలు వేసేది కానీ ఇప్పుడు పది మంది లేకుండా కమిటీలు వేస్తున్నారని ఆరోపించారు. ఒక్క భూపాలపల్లి నియోజకవర్గానికినే కమిటీలు వేయమని అధిష్టానం చెప్పిందా అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బలిజె నర్సింహారాములు, నాయకులు గజ్జి శంకర్, ముంజాల నాగరాజు, మారెపల్లి సదానందం, ఎండీ.రాజ్‌మహ్మద్, కొత్తగట్టు సాయి, అరికిల్ల విజయ్, రాజేందర్ పాల్గొన్నారు.

పీజీ ఎంట్రెన్స్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంకామ్ కోర్సుల్లో ప్రవేశానికి రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ ఫ్రీ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ కోచింగ్‌ను త్వరలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. ఈమేరకు సంబంధించిన పోస్టర్‌ను కాకతీయ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు శుక్రవారం ఆవిష్కరించారు. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలతో కలిసి మే 26వ తేదీ నుంచి ఆన్‌లైన్ ఫ్రీ కోచింగ్ నిర్వహించనున్నట్లు రాజారెడ్డి వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు 99892 92372 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీ కామర్స్ అధ్యాపకులు రాజశేఖర్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, మహ్మద్ యాకూబ్, చిన్నా, జికె.కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉద్యోగ అవకాశాలు

- కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్



సర్టిఫికెట్లు అందుకున్న ఎన్‌సీసీ కేడెట్లు

ధర్మసాగర్ : ఎన్‌సీసీలో చేరడం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తితో పాటు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్నాల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్‌సీసీ రెండేళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకొని రాత పరీక్ష, ప్రాక్టికల్స్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం లెఫ్టినెంట్ కల్నల్ రవి సన్హరే బి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెఫ్టినెంట్ గణేష్ మాట్లాడుతూ 2024–25 సంవత్సరంలో 32 మంది ఎన్‌సీసీ కేడెట్లు పరీక్ష రాయగా 32 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరి ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఎన్‌సీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం కీలకం

కేయూ క్యాంపస్: సామాజిక శాస్త్రాల పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తుందని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ నర్సింహారావు తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మానవ వనరుల విభాగం పరిశోధకులకు రీసెర్చ్ మెథడాలజీపై నిర్వహిస్తున్న తరగతుల్లో భాగంగా ఆయన శుక్రవారం హాజరై మాట్లాడారు. మెథడ్స్ ఆఫ్ డాటా అనే అంశంపై మాట్లాడుతూ పరిశోధకులు అబ్జర్వేషన్, ఇంటర్వ్యూలు, ప్రశ్నావళి, అనే వివిధ రకాల పద్ధతుల ద్వారా డాటాను సేకరించాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుత తరుణంలో సామాజిక శాస్త్ర పరిశోధనలో విషయ పరిజ్ఞానాన్ని ఒక క్రమపద్ధతిలో క్రోడీకరించేందుకు ఇంటర్నెట్, సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తున్నాయని చెప్పారు.

హిందువులంతా సంఘటితం కావాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాదరావు
- పహల్గాం మృతులకు ఘననివాళి



పరకాలలో పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు



ఆత్మకూరు: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరు : హిందువులంతా సంఘటితం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాదరావు పిలుపునిచ్చారు. పహల్గాంలో హిందూ పర్యాటకులపై ఉగ్రమూకల దాడికి నిరసనగా ఉగ్రవాద దిష్టిబొమ్మతో శుక్రవారం మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి కొత్తబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక ఉగ్రవాదుల ఆటలు చెల్లవని భారతప్రభుత్వం తగిన బుద్ధిచెబుతుందన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్యి పైడి, మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ, మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు సదానందం, కిసాన్ మోర్చా నాయకుడు బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : పహల్గాంలో అమాయక హిందువులపై ఉగ్రవాదులు దాడి చేయడం దారుణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మొగిలి, పాల్గొన్నారు.

ధర్మసాగర్ : భారత దేశంలో హిందువులు, ముస్లింలు అన్నదమ్ముల్లా కలసిమెలిసి ఉంటారని జామీయా మస్జీద్ కమిటీ అధ్యక్షుడు యాసిన్, ఉపాధ్యక్షుడు సాదిక్ పాషా అన్నారు. శుక్రవారం హిందుస్థాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

పరకాల: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల కాల్పులతో మారణహోమాన్ని సృష్టించిన ఘటనకు నిరసనగా పట్టణంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ కూడలి వరకు ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు వ్యతిరేక నినాదాలు చేస్తు ర్యాలీ చేపట్టి పాకిస్తాన్ జెండాను దహనం చేశారు. అనంతరం కాల్పుల్లో మరణించిన పర్యాటకుల ఆత్మకు శాంతి చేకూరాలంటూ కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహా కార్యదర్శి గండ్ర శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్నాటి సతీష్, భజరంగ్‌దళ్ కార్యదర్శి రమేష్, డాక్టర్ రజనీకాంత్, పాల్గొన్నారు.

వేలేరు : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి మండలంలోని మల్లికుదుర్ల గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ గొడెల రాజిరెడ్డి మాట్లాడారు.



ఐనవోలులో..



శాయంపేట : మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి



ధర్మసాగర్ : ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



వేలేరు : కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

30 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- వివరాలు వెల్లడించిన ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్



బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్, గ్రామస్తులు

శాయంపేట : ఈ నెల 30 నుంచి మే 3 వరకు స్థానిక శివమార్కండేయ, శ్రీ వేంకటేశ్వర స్వామి ఏకాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ శాయంపేట గ్రామం నందు శివ కేశవుల ప్రతిష్ఠ జరిగిన ఏడాదిలోపు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. 30న అంకురార్పణ, మే 1న గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, అగ్నిస్థాపన, బేరితాడనం, ధ్వజారోహణం, మండల దేవతాపూజానం ఎదుర్కోలు, 2న పంచామృత అభిషేకాలు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి, పర్వత వర్ధని సమేత శ్రీ శివ మార్కండేయ స్వామి కళ్యాణ మహోత్సవాలు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3న షష్టి సుదర్శన, చండీ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణం ఉత్సవ పరిసమాప్తి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాష్, ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, గ్రామస్తులు బాసాని లక్ష్మీనారాయణ, వనం సదానందం, బాల్నె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

29 లోపు వివరాలు అందజేయాలి

- ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మౌటం సంపత్



మాట్లాడుతున్న మౌటం సంపత్

కమలాపూర్ : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశ ఉద్యమాల్లో ఉద్యమించిన ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాలు ఈ నెల 29 వరకు తమ ఉద్యమ వివరాలను పూర్తి ఆధారాలతో సహా ఉద్యమకారుల మండల ఫోరానికి అందజేయాలని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మౌటం సంపత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ ఉద్యమకారుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, రాష్ట్ర కో కన్వీనర్ మోకిడె ప్రసాద్, కోశాధికారి తుమ్మ శోభన్ బాబు, నాయకులు గుండవు సంతోష్, రామస్వామి, కుక్కల రవీందర్, ముప్పు కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసమే వక్ఫ్ చట్ట సవరణ

- బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న ర్యాకం శ్రీనివాస్

కమలాపూర్ : ముస్లిం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ వక్ఫ్ చట్ట సవరణకు శ్రీకారం చుట్టారని వక్ఫ్ చట్టసవరణతో పేదలు కోర్టుల్లో తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించిందని బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ అన్నారు. వక్ఫ్ చట్ట సవరణ–2025పై శుక్రవారం కమలాపూర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల భూములను కొందరు ఆక్రమించుకుని వక్ఫ్ పేరిట అమాయక ముస్లింలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీన్ని అరికట్టేందుకు, దేవుడి పేరిట వచ్చే ఆదాయం పేదల ముస్లింలకు చేరేలా, వారికి న్యాయపరమైన రక్షణ కల్పించేలా వక్ఫ్ చట్ట సవరణ చేశారన్నారు. బీజేపీ మండల కన్వీనర్ భూపతి ప్రవీణ్, నాయకులు తుమ్మ శోభన్, బండి కోటేశ్వర్, మోకిడె ప్రసాద్, కనుకుంట్ల అరవింద్, రత్నాకర్, ప్రభాకర్‌రెడ్డి, సుందరయ్య, రాజు, రాంబాబు, సత్తయ్య పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న భానుమతి

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘ క్షేత్ర సీనియర్ కార్యకర్త పోరండ్ల భానుమతి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భానుమతి మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్నటువంటి కూలీల దాహాన్ని తీర్చడానికి, వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండడానికి ప్రజ్వల్ నుంచి మజ్జిగ ప్యాకెట్లను అందిస్తున్నట్లు తెలిపారు. చల్లటి నీళ్లను కానీ పండ్ల రసాలు కానీ మజ్జిగ ప్యాకెట్లు, నిమ్మరసం లాంటివి తీసుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, వేణు, రాజేందర్, సందీప్, కిషన్‌రావు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



ఆత్మకూరు : పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శాయంపేటలో..

ఆత్మకూరు : ఈనెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దాపూర్‌లో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయరాకుల రవీందర్, సాంబయ్య, సుధాకర్, వంశీగౌడ్, కందికొండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తి క్రాస్‌రోడ్‌లో తలపెట్టిన రజతోత్సవ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, మాజీ ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. సభకు ప్రజలు, యువతి యువకులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గాదె రాజేందర్, నాయకులు గడిపె విజయ్‌కుమార్, దైనంపల్లి కరణ్‌బాబు, రంగు మహేందర్, దైనంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భావం పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాపురావు

విద్యారణ్యపురి: విద్యార్థులు విద్యతోపాటు జాతీయ భావం కూడా పెంపొందించుకోవాలని ఏబీవీపీ ప్రాంత ప్రముఖ్ మాసాడి బాపురావు అన్నారు. ఏబీవీపీ, సామ జగన్‌మోహన్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎప్‌సెట్ ఉచిత శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సామాజిక సమస్యలపై ఏబీవీపీ పోరాడుతోందని గుర్తుచేశారు. సమావేశంలో హనుమకొండ సీఐ సతీష్ డాక్టర్ భగీరథ్, వరంగల్ విభాగ్ ఏలేటి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుంట హర్షవర్ధన్, ప్రాంత కార్యసమితి సభ్యులు ఆరెపెల్లి సుజిత్, బాధ్యులు కొత్తపెల్లి సుధాకర్, ఉపాధ్యాయులు శ్రీదేవి, రోహిణి, సంజీవ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.